క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి సబ్ స్టేషన్ నుంచి కారాడ ఫీడర్, గొల్లపల్లి సబ్ స్టేషన్ నుంచి చర్చి సెంటర్ వరకు వెళ్లే ఫీడర్ల పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలివేస్తున్నామని ఈఈ ఆవాల అనంతరావు తెలియజేశారు. దీంతో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కా రాడ, కొల్లివలస, కొత్తూరు, దావాలవీధి, కోరాడ వీధి, సిరిపువీధి, చర్చిసెంటర్, బలిజిపేట రోడ్డు, రెల్లివీధి, సంఘవీధులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎన్.బూర్జవలసలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ నీలమ్మ, కార్యదర్శి దీపక్

తెర్లాం: మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ బి.మధుసూదనరావు, ఈఓపీఆర్డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్ బేరి నీలమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పంచాయతీ కార్యదర్శి దీపక్ పర్యవేక్షించారు. గ్రామంలోని వీధి కాలువల్లో పూడికతీత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని సర్పంచ్ నీలమ్మ తెలిపారు.

మాజీ ఎంపీ రంగారావు జయంతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

బొబ్బిలి: ఎమ్మెల్యే బేబీ నాయన తండ్రి, మాజీ ఎంపీ దివంగత ఆర్‌వీజీకే రంగారావు 98వ జయంతి సందర్భంగా స్థానిక బృందావనంలో ఉన్న స్మృతి వనంలో ఎమ్మెల్యే నివాళులర్పించారు. గురువారం జయంతి సందర్భంగా ఆయనతో పాటు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, స్థానికులు హాజరై రంగారావు సమాధి వద్ద నివాళులర్పించారు.

గ్రామాలు స్వచ్ఛంగా ఉండాలి

రేగిడి: ప్రతీ గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఈఓపీఆర్డీ సత్యనారాయణ సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. ప్రతీ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్‌లుగా హేమసుందర్, గోపాలనాయుడు పాల్గొన్నారు.

మానసిక, శారీరక రుగ్మతల సమస్యలపై న్యాయ సహాయం



ఆస్పత్రిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

బొబ్బిలి: ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఉన్న మానసిక, శారీరక వైకల్యం ఉన్న వారికి అవసరమైన న్యాయ సహాయం అందించే అవకాశాలున్నాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీలో న్యాయ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. న్యాయ సహాయం పొందేందుకు వైద్య సిబ్బంది వారికి సహకరించి కోర్టులను సంప్రదించేలా చైతన్యం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వివిధ విభాగాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యాధికారి గేదెల శశిభూషణ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవామృతంతో పంటకు మేలు

బొబ్బిలి రూరల్: నాణ్యమైన జీవామృతం తయారు చేసి వరి పంటకు వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి తులసి అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రైతులకు జీవామృతం తయారీ విధానాన్ని గురువారం వివరించారు. ఐసీఆర్‌సీలు, రైతులు పాల్గొన్నారు. మెట్టవలస గ్రామంలో నారు శుద్ధి చేసి కొనలను తొలగించి నాటడం ద్వారా రైతులకు మంచి దిగుబడులు సాధించవచ్చని అడిషనల్ డీపీఎం స్వామినాయుడు తెలిపారు. డీపీఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో.. నోరు నొక్కేశారు...

- అధికార పార్టీ నాయకుల హల్‌చల్
- మొహరించిన పోలీసులు



రేగిడి : సోమరాజుపేటలో డైరెక్టర్లుగా ఎన్నికైన అభ్యర్థులు



బొబ్బిలి పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చేతులెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



రాజాం సిటీ: పొగిరి ఎంపీపీ పాఠశాల నూతన చైర్‌పర్సన్ సావిత్రితో సభ్యులు



రాజాం : బొద్దాం హైస్కూల్‌లో నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యుల ప్రమాణ స్వీకారం



బొబ్బిలి రూరల్: కోమటిపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ నూతన కమిటీ సభ్యులతో ఉపాధ్యాయులు

బొబ్బిలి: ఎస్ఎంసీ ఎన్నికల్లో ఎవరూ నోరు మెదపకుండా అధికార పార్టీ నాయకులు తమ మనుషులను చైర్మన్లుగా ఏర్పాటు చేసుకున్నారు. అత్యధికంగా ఏకగ్రీవం చేసుకునేందుకు మరెవర్నీ మాట్లాడనీయకుండా పోలీసులను మోహరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలల్లో కమిటీల ఎన్నికలకు పోలీసులు అధిక సంఖ్యలో హాజరై మరెవర్నీ మాట్లాడనీయలేదు. పట్టణం, మండలంలో 91 పాఠశాలలుండగా పెద్ద పాఠశాల్లో చైర్మన్లుగా అధికార పార్టీ కార్యకర్తలు, చిన్న స్కూళ్లకు ప్రశ్నించే వారికి తాయిలాలుగా వదిలేసి మొత్తం పాఠశాలలన్నీ అధికార పార్టీ ప్రాద్బలంతోనే ఎన్నికలు జరిగే విధంగా ఏర్పాట్లు జరిగాయి. రామభద్రపురం మండలంలో 57 పాఠశాలల్లో 21 పాఠశాలలను ఏకగ్రీవంగా చేసుకున్నారు. మిగతా 36 పాఠశాలల్లో ఎన్నికలు జరిగినా నామమాత్రమే! తెర్లాం మండలంలో 67 పాఠశాలలున్నాయి. ఇక్కడ 60 ఏకగ్రీవంగా ఎన్నికల తంతు పూర్తి చేశారు. బాడంగి మండలంలో 49 పాఠశాలలుండగా 25 ఏకగ్రీవం కాగా మిగతా 24 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. పారాదిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పోలీసుల జోక్యం చేసుకొని సద్దుమణిగించారు.

వాయిదా

రేగిడి: మండలంలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. సోమరాజుపేట ప్రాథమిక పాఠశాలల్లో 14 మంది డైరెక్టర్లు ఎన్నిక కాగా, ఇది చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులు ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొచ్చి గందరగోళం సృష్టించారు. హెచ్ఎం ఎర్నేన అచ్యుతరావు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో హెచ్ఎం తల్లి మృతి చెందడంతో ఈ ఎన్నికలు వాయిదా వేసి హెచ్ఎం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయం ఎంఈఓకు తెలియజేయగా, ఇన్‌చార్జ్ హెచ్ఎంగా వేరే ఉపాధ్యాయురాలికి బాధ్యతలు అప్పగించినప్పటికీ ఎన్నికలు జరగలేదు. మండలంలో తునివాడ, చిన్నశిర్లాం, మునకలవలస ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా ఎన్నికల ప్రక్రియ వాయిదాపడింది. ఇక్కడ కూడా అధికార పార్టీ నేతలు తమకు మెజార్టీ లేకపోవడంతో ఎన్నికలను బలవంతంగా వాయిదా వేయించారు.

ప్రశాంతంగా..

సంతకవిటి: మండలంలోని మొత్తం 74 పాఠశాలలకుగాను 52 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవం కాగా 17 పాఠశాలల్లో గురువారం ఎలక్షన్ ప్రశాంతంగా జరుగగా మిర్తివలస, గోవిందపురం, శేషాద్రిపురం, చిత్తారపురం, గారన్నాయుడునేట గ్రామాలలో సరిపడ కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు ఎంఈఓలు శాంతకుమారి, సీహెచ్ భాస్కరరావు వెల్లడించారు.

ఎన్నికలు వాయిదా

రాజాం: మండలంలో డోలపేట జెడ్పీ హైస్కూల్‌తో పాటు ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, సీతంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆయా పాఠశాలల్లో పూర్తి స్థాయిలో కోరం లేక ఈ ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆగూరులో కోరం ఉన్న ఎన్నికలు నిర్వహించలేదని మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు కోనారి అప్పారావు ఆరోపించారు. కేవలం అధికార పార్టీ ఒత్తిళ్ల కారణంగానే వాయిదావేశారని ఆరోపించారు. డోలపేట హైస్కూల్‌లో ఉద్దేశపూర్వకంగానే ఎన్నిక వాయిదా వేసారని వైఎస్సార్‌సీపీ రాజాం జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి ఆరోపించారు.



రామభద్రపురం: మిర్తివలస ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ



తెర్లాం: కూనాయవలసలో ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు



వంగర: కోనంగిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



నందిగాంలో జరిగిన లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలు

తెర్లాం: పాడి పశువులకు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను జిల్లాలోని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు అన్నారు. మండలంలోని నందిగాం గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడారు. ఈ సీజన్‌లో పాడి పశువులకు ఎక్కువగా గర్భకోశ వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. గర్భకోశ వ్యాధుల నివారణకు జిల్లా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పశు సంవర్ధక శాఖ డీఎల్‌డీఏ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ నందిగాంలో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరంలో 27 ఆవులు, 17 పడ్డలు, 28 లేగదూడలకు చికిత్సలు చేయడం జరిగిందని తెలిపారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్, బాడంగి, ఉద్దవోలు, పొగిరి పశువైద్యాధికారులు డాక్టర్ సతీష్, అరుణ, దీపిక, నందిగాం సర్పంచ్ ఆర్నిపల్లి గంగ, ఎంపీటీసీ ప్రతినిధి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నందిగాంతో పాటు పలు గ్రామాల నుంచి 28 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వీటిలో గిరిజాతి, ఒంగోలు జాతి, జెర్సీ జాతికి చెందిన ఆవు దూడలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. లేగదూడల ప్రదర్శనలో పాల్గొని విజేతలైన రైతులతోపాటు, ప్రదర్శనలో పాల్గొన్న ప్రతీ రైతుకు జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

బండెనక బండి కట్టి...



ఇసుకలోడుతో రోడ్డుపైనే ఉన్న నాటుబళ్లు

బొబ్బిలి రూరల్: ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక అవసరాలను తెలుసుకుని గ్రామ రెవెన్యూ పరిధిలో మాత్రమే ఉచిత ఇసుకను, అదీ ఎడ్లబళ్లతో తవ్వుకోవచ్చన్నది ప్రభుత్వం ఆదేశాలు. కానీ ఇక్కడ ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న ఘటనలు ప్రతినిత్యం సాగుతున్నాయి. మండలంలోని వేగావతి నది ఒడ్డున ఉన్న పారాది గ్రామంలో కొంతమంది ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఎంచక్కా పగటిపూట ఇసుకతో నాటుబళ్లను నింపి రాత్రిపూట తరలించే ప్రక్రియ చేపడుతున్నారు. నాటుబళ్లతో ఇసుకను కొనుగోలుచేసుకున్న ఇతర ప్రాంత ఇళ్లనిర్మాణపు యజమానులు అర్ధరాత్రి నాలుగు ఇసుక బళ్లను మాట్లాడుకుని ఒక ట్రాక్టర్ లోడుగా మార్చి అర్ధరాత్రి తరలింపును చేపడుతున్నారు. శని, ఆదివారాల్లో మరింత ఉధృతంగా సాగుతుంది. ఆయా రోజుల్లో కార్యాలయాలు సెలవు కావడం, అధికారులు అందుబాటులో ఉండకపోవడం, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా దూర ప్రాంతాల్లో ఉన్నామంటూ తప్పించుకోవడం వంటి కారణాలతో ఆయా రోజుల్లో రాత్రిపూట 10 గంటల నుంచి, ఇసుక, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు.

గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ సర్వే



కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న డీఈ రెడ్డి

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో ప్రజలకు అసరమైన తాగునీటిని కుళాయిల ద్వారా ఇళ్లకు అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.రెడ్డి తెలిపారు. మండలంలో జలజీవన్ మిషన్ (జేజేఎం) పథకం అమలు తీరు, తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లోని గ్రామాలకు ఇప్పటికే రెండు విడతల్లో ఇంటింటి కుళాయి ద్వారా నీరందిస్తున్నామన్నారు. మిగిలిన వారి వివరాలను సర్వేచేసి అందజేయాలని ఆయన సూచించారు. కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది పరస్పర సహకారంతో ఈ సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. ఆయా సచివాలయాల సిబ్బందిని ఈ సర్వే కోసం వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రవికుమార్, జేఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా ర్యాలీ

రాజాం సిటీ:

పట్టణ పరిధి వస్త్రపురి కాలనీలో స్టాప్ డయేరియా ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జె.రామప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు డయేరియాపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వస్త్రపురికాలనీలో డయేరియాపై అవగాహనా ర్యాలీ

నేడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

రాజాం సిటీ: నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని వివిధ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ జి.సురేష్‌బాబు, డీఈఈ ఫణీంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టుకొమ్మలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ అసౌకర్యానికి ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈలు ఓజేసీఏ కుమార్, వి.సురేష్‌కుమార్ కోరారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన : పీడీ



రేగిడి : గ్రామదర్శినిలో ఫిర్యాదులు తీసుకుంటున్న పీడీ కల్యాణచక్రవర్తి



బొబ్బిలి: అధికారులకు వార్డు సమస్యలు వివరిస్తున్న కోట పెద రాములు, స్థానికులు

రేగిడి: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామ సందర్శన కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మండల ప్రత్యేకాధికారి, పీడీ కల్యాణచక్రవర్తి అన్నారు. మండలం ఖండ్యాం గ్రామంలో గురువారం గ్రామ దర్శిని నిర్వహించి, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమం అనంతరం వెంకటాపురం గ్రామాన్ని కూడా అధికారులు సందర్శించారు. ఎంపీడీఓ శ్యామలాకుమారి, పంచాయతీ కార్యదర్శి పోలినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దృష్టికి గ్రామ సమస్యలు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కారిస్తామని నోడల్ ఆఫీసర్ కె.మధుసూదనరావు అన్నారు. మండలంలోని నారాయణప్పవలస గ్రామంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయా శాఖల అధికారులతో పర్యటించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాగాన శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, తహసీల్దార్ ఎం.శ్రీను ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజేవలసలో గ్రామదర్శిని

రాజాం: మండలంలో ముద్దాడజోగివలస గ్రామంలో గ్రామ దర్శిని కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ వి.శ్రీనివాసరావుతో పాటు పలు శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొని ప్రజలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ స్థానిక గ్రామ సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించండి

బొబ్బిలి: పురపాలిక పరిధిలోని పాత బొబ్బిలి రెండో వార్డులో వార్డు సందర్శన కార్యక్రమం సందర్భంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారుల ముందు ఏకరువు పెట్టారు. పాత బొబ్బిలి రెండో వార్డులో గురువారం కమిషనర్ ఎల్ రామలక్ష్మి మున్సిపల్ సిబ్బందితో వార్డు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ కోట పెదరాములు వార్డులోని కాలువల్లో మురుగు నిల్వలు దగ్గరుండి చూపించారు. అవసరమయిన ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ ఎల్.రామలక్ష్మి స్థానికులకు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి గ్రామ సందర్శన దోహదం

తెర్లాం: గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సందర్శన కార్యక్రమం ద్వారా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు దోహదపడుతుందని మండల నోడల్ అధికారి వి.టి.రామారావు అన్నారు. మండలంలోని నందిగాం గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి.మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఈఓపీఆర్డీ నీలిమ, వివిధ శాఖల అధికారులు, నందిగాం సర్పంచ్ ఆర్నిపల్లి గంగ. ఎంపీటీసీ ప్రతినిధి అల్లు లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తలగాంలో గ్రామ సందర్శన

వంగర: మండల పరిధి తలగాంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం జరిగింది. మండల ప్రత్యేకాధికారి కె.సందీప్ ఆధ్వర్యంలో అధికారులు బృందం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల, సచివాలయం తనిఖీ చేశారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సంకిలి సురేష్, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం

రామభద్రపురం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని ప్రత్యేకాధికారి గోవిందరావు అన్నారు. తారాపురం గ్రామంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మతో కలిసి గురువారం గ్రామ సందర్శన నిర్వహించారు. ముందుగా అక్కడ ఉన్న ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పిల్లలను, హెచ్ఎం సూర్యకుమారిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి పరిశీలించారు. వంట గది వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం



డంపింగ్ యార్డు నిర్వహణ వివరాలపై ఆరా తీస్తున్న ఆర్డీ నాగరాజు

- మున్సిపల్ ఆర్డీ నాగరాజు

రాజాం సిటీ: మున్సిపాల్టీల్లో పారిశుద్ధ్యం మెరుగుకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు అన్నారు. స్థానిక మున్సిపాల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసిన ఆయన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. డ్రెయిన్‌లలో పేరుకుపోయిన మురుగు తొలగించేందుకు గ్యాంగ్ వర్క్ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా రెండు నెలలు పాటు సాగించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి రోజు వార్డుల పర్యటన చేపట్టడంతో పాటు మెగా ఫోన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే ప్రజలు కూడా తమ వార్డుల్లోకి వస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించి సహకరించాలని కోరారు. రోడ్లపైకి మురుగునీరు ప్రవహించకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వార్డులోను రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన గడ్డిని బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై ఆరా తీసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మరోసారి మున్సిపాల్టీకి వచ్చినప్పటికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అంతకు ముందు మండల పరిధి గార్రాజుచీపురుపల్లి వద్ద మున్సిపాల్టీకి సంబంధించిన డంపింగ్ యార్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను ఎంత మొత్తంలో సేకరిస్తున్నారు, కంపోస్టు తయారీ విధానం తదితర అంశాలపై అడిగితెలుసుకున్నారు. ఈయనతోపాటు కమిషనర్ జె.రామప్పలనాయుడు, శానిటరీ ఇనెస్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఏఈలు వెంకట్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

విజయనగరం ఫూల్‌బాగ్: నవంబర్ 27 నుంచి 30 వరకు జరగనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ఆహ్వాన సంఘం ఎన్నిక గురువారం స్థానిక అమర్‌భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడిగా మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజు, అధ్యక్షుడిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, చీఫ్ అడ్వైజర్‌గా సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్. నాగభూషణం, కోశాధికారిగా వి. రంగరాజు ఎన్నికయ్యారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై జరుగుతున్న దోపిడిని తిప్పి కొట్టడం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. కార్యక్రమంలో రొంగలి పోతన్న, ఒమ్మి రమణ, కె.శివారెడ్డి, షేక్ మస్తాన్, ఫణీంద్ర, సాయికుమార్, కుల్లాయి స్వామి పాల్గొన్నారు.